క్లుప్తంగా...

కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కార్డెన్ సెర్చ్

బహదూర్‌పురా: కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య 250 మంది పోలీసులతో కార్డెన్ సెర్చ్‌ను మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారు జామున 3 గంటల వరకు నిర్వహించారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో వాహన పత్రాలు లేని మూడు ఆటోలు, 41 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ సాయి చైతన్య తెలిపారు. 15 మంది రౌడీషీటర్లు, ఏడుగురు అనుమానిత రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి నేరాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు.

వీధి కుక్కలను బంధించి తీసుకెళ్లిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది.



కుక్కలను బంధించి తీసుకెళుతున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

సంతోష్‌నగర్: ఇటీవల డీఆర్‌డీఓ టౌన్‌షిప్, సంతోష్‌నగర్‌లో కుక్కల దాడిలో గాయపడిన నేపథ్యంలో బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. సంతోష్ నగర్, కళందర్‌నగర్ తదితర బస్తీల్లో బుధవారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది తిరుగుతూ బస్తీల్లో స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కలను బంధించి తీసుకెళ్లారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

నాంపల్లి: బజార్‌ఘాట్ బంగారు ముత్యాలమ్మ దేవాలయ రెండవ వార్షిక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ పునర్ నిర్మాణం తర్వాత గత రెండేళ్లుగా ఆలయంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురవీధుల్లో పల్లకి సేవ కన్నుల పండువగా సాగింది. కార్యక్రమంలో జెట్ట గోపాల్, కె.మహేందర్, రమేష్‌కుమార్ జైస్వాల్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

సుల్తాన్‌బజార్: ధూప దీప నైవేద్యం పథకాన్ని మరో 2796 దేవాలయాలకు వర్తింపజేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం పట్ల తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య అర్చకుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ముఖ్యమంత్రి చిత్రపటానికి అర్చకులు పాలాభిషేకం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అర్చకుల సమస్యలను పాలకులు పట్టించుకోలేదని, స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని, ధూప దీప నైవేద్య అర్చకుల సంఘం అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవా శర్మ కొనియాడారు. గతంలో ఆలయాల నిర్వహణకు రూ.6 వేలు చెల్లించేవారని, ఇప్పుడు దానిని రూ.10 వేలకు పెంచారన్నారు. అదేవిధంగా బ్రాహ్మణులకు అందించే గౌరవ భృతి అర్హత వయస్సును 75 ఏళ్ల నుండి 65 ఏళ్లకు తగ్గించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

సత్కారం



సుల్తాన్‌బజార్: ప్రముఖ విమర్శకులు ఆచార్య ఎస్వీ రామారావు తన 83వ జన్మదినం సందర్భంగా బుధవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి తన తెలంగాణ వాఙ్మయకోశం గ్రంథాన్ని సమర్పించారు. అనంతరం మంత్రి సబితా ఇంద్రారెడ్డి రామారావును శాలువాతో సత్కరించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రౌడీషీటర్ దారుణ హత్య



ఫిర్దౌస్ (ఫైల్)

నాంపల్లి: హబీబ్‌నగర్‌లో రౌడీ షీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. హబీబ్‌నగర్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ ఫిర్దౌస్ బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో నిలోఫర్ వైపు వెళ్తుండగా ప్రత్యర్థులు ఐజాస్ తదితరులు బజార్‌ఘాట్ వద్ద కాపుగాసి కత్తులతో నరికి చంపారు. అందరూ చూస్తుండగానే ఈ ఘటన జరగడంతో స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడిన ఫిర్దౌస్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పురానాపూల్ చౌరస్తా ట్రాఫిక్ మయం

- తరచూ ట్రాఫిక్ సమస్య
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



పురానాపూల్ వంతెనపై నిలిచిన ట్రాఫిక్

జియాగూడ: పురానాపూల్ చౌరస్తా నిత్యం ట్రాఫిక్ సమస్యతో నెలకొంటోంది. పలు ప్రాంతాలు, ప్రధాన మార్కెట్లకు వెళ్లే చౌరస్తా కావడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇక్కడే కొన్ని రోజులుగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. నత్తనడకగా జరుగుతుండడంతో ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోతోంది. పురానాపూల్ చౌరస్తా నుండి అఫ్జల్‌గంజ్, కార్వాన్, జియాగూడ మేకలమండి, సబ్జిమండి 100 ఫీట్ల రోడ్డు చార్మినార్‌లకు వెళ్లే ప్రధాన కూడలి చౌరస్తా ట్రాఫిక్ సమస్య తీరేందుకు గతంలో చర్యలు తీసుకున్నప్పటికీ పరిష్కారం అంతంత మాత్రమే. చౌరస్తాలోని నిత్యావసర, కూరగాయలు, పండ్ల తోపుడుబండ్లు నెలకొని ఉండడం, ఆటోవాలాలు గంటల తరబడి చౌరస్తా వద్దే ఉండడంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. గోషామహల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే పురానాపూల్ చౌరస్తా సమస్యలు పరిష్కరించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

పాత వంతెనపై కొనసాగుతున్న కూరగాయల మార్కెట్

పురానాపూల్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ పురానాపూల్ వంతెనపై కూరగాయల మార్కెట్ కొనసాగుతోంది. గతంలో పురానాపూల్ చౌరస్తా నుండి చార్మినార్ వెళ్లేందుకు ఉన్న ఈ వంతెన సరిపోకపోవడంతో 1995లో అదనపు వంతెన చేపట్టి ప్రారంభించారు. అయినా పాత వంతెనపై కూరగాయల మార్కెట్ కొనసాగుతుండడం వల్ల అదనపు రద్దీకి వంతెన సరిపోవడం లేదు. పురానాపూల్ పాత వంతెనపై కొనసాగుతున్న కూరగాయల మార్కెట్‌ను తరలించి రెండు వంతెనపై వన్ వే పద్ధతిని అమలు చేయాలని ప్రయాణికులు తెలియజేస్తున్నారు.

నత్తనడకన చౌరస్తా అభివృద్ధి పనులు

పురానాపూల్ చౌరస్తా రోడ్డు వెడల్పు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. చౌరస్తా నలుదిక్కులా అక్రమ షెడ్లను తొలగించడం తిరిగి చిరు వ్యాపారులు వేసుకోవడం పరిపాటిగా మారింది. చౌరస్తాలో రోడ్డు వెడెల్పు పనులు నత్త నడకగా కొనసాగుతున్నాయి. త్వరలో చౌరస్తా అభివృద్ధి పనులు పూర్తిచేసి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మత్స్యశాఖలో పదవి కేటాయించాలి



మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కావూరి వెంకటేష్

జియాగూడ: మత్స్యశాఖలో చేపలుపట్టే కులవృత్తిదారులకే పదవి కేటాయించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కావూరి వెంకటేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం మత్స్యశాఖ మంత్రి శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కావూరి వెంకటేష్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకాలం నాటి నుండి పనిచేస్తున్న తనకు మత్స్యశాఖలో వైస్ చైర్మన్ పదవిని కేటాయించాలని కోరారు. అలాగే ఇటీవల మత్స్యశాఖ చైర్మన్‌గా ముదిరాజ్ కులానికి చెందిన పిట్టల రవీందర్‌ను నియమించడంతో పాటు పార్టీలో గత సంవత్సరమే చేరిన దిడ్డి మల్లయ్యకు వైస్ చైర్మన్ పదవి కేటాయిస్తుండడం సరికాదన్నారు. ఇప్పటికే దొడ్డిమల్లయ్య ప్రభుత్వ ఉద్యోగిగా రిటైర్డ్ అయి పెన్షన్ కూడా పొందుతున్నారన్నారు. చేపలు పట్టే కులానికి చెందిన తనకు న్యాయం చేయాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో కార్వాన్ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు నర్మద, జియాగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి సి.బాబు, మధు, కృష్ణకుమారి, సంతోషిబాయి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యా నైపుణ్యాల అభివృద్ధితోనే ఉన్నత స్థానం



కార్యక్రమంలో పాల్గొన్న రెడ్డి సుబ్రహ్మణ్యం, ఆచార్య లింబాద్రి, సుబ్బారావు, చందా వడ్డె, డాక్టర్ డిటి.చారి, డాక్టర్ బాల భాస్కర్ తదితరులు

చార్మినార్: విద్యతో పాటే ఉపాధి కల్పన నూతన విద్యా విధానమని... ఆ విధాన ఫలాలను తొలి సంవత్సరం నుండి చూస్తున్నామని కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలో గత సంవత్సరం రిటైల్ సెక్టార్ సంస్థల సహకారంతో తొలిసారిగా ప్రవేశపెట్టిన బీబీఏ రిటైలింగ్ కోర్సు విద్యార్థులు వారంలో మూడు రోజులు తరగతులకు హాజరై.. మిగిలిన మూడు రోజులు రిలయన్స్ ట్రెండ్స్, స్టార్ బక్స్, స్పార్ వంటి రిటైల్ మార్కెట్‌లో పని చేస్తున్నారు. కోర్సు మొదటి సంవత్సరం పూర్తయిన సందర్భంగా కోర్సు క్షేత్రస్థాయి పరిశీలన, విద్యార్థుల అనుభవాలను తెలుసుకోవడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న సుబ్రహ్మణ్యం మాట్లాడారు. నూతన విద్యా విధానంలో నైపుణం అనేది చాలా కీలకమని... నైపుణ్యంతో పాటు ఉన్నత విద్యార్జనకు ప్రాముఖ్యత ఉందని...పని చేస్తూ చదువుకోవడంతో రెండింటివిలువను విద్యార్థులు గుర్తిస్తారన్నారు. అతిథులుగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య ఆర్. లింబాద్రి, సెక్టర్ కౌన్సిల్ ప్రతినిధి సుబ్బారావు, ఎజీవో డాక్టర్ డి.టి.చారి, ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్, రిటైల్ రంగ ప్రతినిధి చందా వడ్డి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులతో వారి విద్య, ఉపాధి సంబంధిత విషయాలపై చర్చించారు. ఆచార్య లింబాద్రి మాట్లాడుతూ... సిటీ కళాశాలలో ఇలాంటి కోర్సులు ప్రవేశపెట్టడంతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధి అందుతోందన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి మరికొన్ని కళాశాలల్లో ఇలాంటి వినూత్న కోర్సులను ప్రవేశపెడతామన్నారు. సెక్టార్ కౌన్సిల్ ప్రతినిధి సుబ్బారావు మాట్లాడుతూ... స్కిల్ ఆధారిత కోర్సుల ద్వారానే విద్యార్థులు ఉపాధి అవకాశాలను సాధించగలుగుతారని తెలిపారు. కళాశాల విద్యా ఏజీవో డాక్టర్ డి.టి.చారి మాట్లాడుతూ.. కమిషనర్ నవీన్ మిత్తల్ సూచనలు, సలహాల మేరకు సిటీ కళాశాలలో ఈ సంవత్సరం మరో రెండు స్కిల్ ఆధారిత కోర్సులను ప్రవేశపెట్టామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ఉపాధిని, నైపుణ్యాన్ని అందించే కొత్త కోర్సులను ప్రవేశపెట్టడానికి ప్రభుత్వ సిటీ కళాశాల సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో బీబీఏ విద్యార్థులు శివ, దీప్తి మాట్లాడుతూ... చదువుకుంటూ ఉద్యోగం చేయటంతో స్కిల్స్‌తో పాటు నాయకత్వ లక్షణాలు ఏర్పడుతాయని... స్టార్ బక్స్ లాంటి అంతర్జాతీయ సంస్థల్లో పని చేయడంతో వినియోగదారుని అవసరాలు, క్రమశిక్షణ లాంటివి మెరగవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రత్న ప్రభాకర్, గజేంద్ర బాబు, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ ఝాన్సీ రాణి, డాక్టర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి



గోల్కొండ: బీఆర్‌ఎస్ హయాంలోనే తెలంగాణలోని ఆలయాలు కొత్త రూపు సంతరించుకున్నాయని బీఆర్‌ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇంచార్జ్ టి. జీవన్ సింగ్ అన్నారు. బుధవారం నానల్‌నగర్ తిరుపల్లిగడ్డ శ్రీకోవెల రంగనాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసిఆర్ దేశంలోనే సెక్యులర్ ముఖ్యమంత్రి అని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఈ.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18వేల వేతనం చెల్లించాలి



అఫ్జల్‌గంజ్: ఆశా వర్కర్లకు వేతనంగా రూ.18000 వేలుగా నిర్ణయించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ గోషామహల్ జోన్ కన్వీనర్ కె జంగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బేగంబజార్ యూపిహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ అరవింద్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎంపీ సోయం బాబూరావుపై అడిషనల్ డీజీపీకి ఫిర్యాదు



నాంపల్లి: పాస్టర్లను బుల్లెట్లు దించి చంపేస్తామని రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ సోయం బాబురావుపై క్రైస్తవ దళిత సంఘాల నేతలు అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం సైఫాబాదులోని డీజీపీ కార్యాలయంలో తెలంగాణ పాస్టర్స్ అసోసియేషన్ రెవ టి.ఆర్.రాజు నేతృత్వంలో బిషప్ సామ్యూల్ క్రిస్టియన్ జర్నలిస్ట్ ఫోరం రెవ కె.ఎస్.ప్రకాష్ రావు, సౌత్ ఇండియా మూవ్‌మెంట్ వ్యవస్థాపకులు గాలి వినోద్ కుమార్ అదనపు డీజీపీకి ఫిర్యాదు పత్రాలను అందజేశారు. ఆదిలాబాద్ జిల్లాలో మత ఘర్షణల ప్రేరేపించే విధంగా, క్రైస్తవ గిరిజనులను గుండు కొట్టించి బుద్ధి చెబుతామని, రిజర్వేషన్లు రద్దు చేస్తామని బెదిరించిన ఎంపీ సోయం బాబురావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వాటర్‌బోర్డులో పాత బకాయిలు ఇప్పించండి



ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసిన పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: వాటర్‌బోర్డులో కాంట్రాక్టర్ల పాత బకాయిలు ఇప్పించేందుకు కృషి చేయాలని బీఆర్‌ఎంపీ రంజిత్ రెడ్డిని వాటర్‌బోర్డు కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జేఏసీ మీడియా ఇన్‌చార్జ్, కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ కోరారు. కొన్ని సంవత్సరాలుగా వాటర్ బోర్డు ఎండీ దానకిశోర్ తమ కాంట్రాక్టర్ల పాతబకాయిలు చెల్లించకపోవడంతో నష్టాలకు గురవుతున్నామన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ.... వాటర్‌బోర్డు ఎండీ నిర్ణయాలతో వందలాది మంది కాంట్రాక్టర్లు రోడ్డుపాలయ్యారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏఎంఎస్ సెక్షన్ వర్క్స్ విధానాన్ని ప్రారంభించడంతో చిన్నాచితకా కాంట్రాక్టర్స్ అంతా పనులు లేక నష్టాలకు గురవుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రంజిత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. వాటర్‌బోర్డులో కాంట్రాక్టర్ల సమస్యలను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మంత్రి తలసాని సహకారంతో గోషామహల్ అభివృద్ధి



మొహరం బస్తీలో సమస్యలు తెలుసుకుంట్టున్న బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో గోషామహాల్ నియోజకవర్గం నలుమూలలా అభివృద్ధిపనులు చేపడుతున్నట్లు నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలన్నీ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి మంత్రి సహకారంతో పరిష్కరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గం పరిధిలోని మొరంబస్తీలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.... మొరంబస్తీలో మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు ఇతర దీర్ఘకాలిక సమస్యలను మంత్రి తలసాని సహకారంతో పలు శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బీఆర్‌ఎస్ హయంలోనే గోషామహల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరితగతిన మొరం బస్తీ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు కె.దేవేందర్, ప్రధాన కార్యదర్శి వేణుకుమార్, ఇతర నాయకులు హేమంత్‌కుమార్, అర్జున్, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నా.

బహిరంగ సభను విజయవంతం చేయండి

గౌలిపురా: జూన్ 4వ తేదీన కొత్తగూడెంలో భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో జరగబోయే భారీ బహిరంగ సభకు లక్షలాది మంది వచ్చి సభను జయప్రదం చేయాలని హైదరాబాద్ జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు జి.చంద్రమోహన్ గౌడ్ పిలుపునిచ్చారు. గౌలిపురా డివిజన్ ఛత్రినాక చౌరస్తా ఏఐటీయుసీ ఆటో స్టాండ్ వద్ద చలో కొత్తెగూడెం పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హమీలను తీర్చలేని ప్రభుత్వాలను గద్దె దింపి ఇంటికి సాగనంపజేయడానికి భారీ బహిరంగ సభను నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి సభ్యులు అటుకుల రాజు, గౌలిపురా డివిజన్ సహాయ కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో చిత్రలేఖన పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులతో బీజేపి కార్వాన్ నియోజకవర్గ ఇంచార్జ్ అమర్ సింగ్

గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కేంద్ర ప్రభుత్వం భారీ ఎత్తున నిర్వహిస్తుందని బీజేపి కార్వాన్ నియోజకవర్గ ఇంచార్జ్ అమర్ సింగ్ అన్నారు. బుధవారం కేంద్రపురాతత్వ సర్వేక్షణ శాఖ ఆధ్వర్యంలో గోల్కొండ కోటలో ఖిలా ఔర్ కహానియా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి రోజు వివిధ పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు చిత్రలేఖనానికి అవసరమైన అన్ని రకాల వస్తువులు అందించారు. ఈ సందర్భంగా టి. అమర్ సింగ్ మాట్లాడుతూ..... తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు కేంద్రప్రభుత్వం గోల్కొండ కోటను ఎంచుకుందని, ఇందులో భాగంగా 3 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈనెల 2వ తేదీన కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి ఉదయం 7 గంటలకు కోటలో జరిగే పతాకావిష్కరణలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భందా చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సునీల్ యాదవ్ తదితరులున్నారు.

నాజ్నీన్ 'పసిడి' గురి



సాక్షి, హైదరాబాద్: సీఎం కప్ క్రీడోత్సవాల్లో భాగంగా షూటింగ్ ఓపెన్ సైట్ మహిళల విభాగంలో హైదరాబాద్‌కు చెందిన సయ్యదా ఫహమీనా నాజ్నీన్ విజేతగా నిలిచింది. హైదరాబాద్ యూనివర్సిటీ షూటింగ్ రేంజ్‌లో జరిగిన ఈ ఈవెంట్‌లో నాజ్నీన్ మొత్తం 202 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణ పతకాన్ని సాధించింది. భన్విత (మేడ్చల్; 201 పాయింట్లు) రజతం, రేవతి రాజశేఖర్ (హైదరాబాద్; 198 పాయింట్లు) కాంస్య పతకం సాధించారు. హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి విజేతలకు పతకాలు అందజేశారు.

బంగారు భవిష్యత్తుకు సాంకేతిక విద్య బాటలు

గోల్కొండ: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు సాంకేతిక విద్య బాటలు వేస్తుందని ప్రముఖ కూచిపూడి డ్యాన్సర్ పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం పద్మజారెడ్డి అన్నారు. షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాల 2019–23 బ్యాచ్‌కు చెందిన విద్యార్థినుల క్రీడోత్సవాలు బుధవారం కళాశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె విజేతలకు బహుమతులు అందించారు. ఈ బ్యాచ్‌కు చెందిన విద్యార్థినులు జాతీయ, విశ్వవిద్యాలయ పోటీలలో ఎన్నో అవార్డులు తెచ్చారన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ జి. శ్రీవిద్యారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళ పొత్తికడుపులో 7కిలోల కణితి తొలగింపు

అఫ్జల్‌గంజ్: మహారాష్ట్రకు చెందిన ఓ మహిళ పొత్తి కడుపులో పేరుకుపోయిన అండాశయ తిత్తి కణితిని ఉస్మానియా ఆస్పత్రిలోని జనరల్ సర్జరీ వైద్యుల బృందం శస్త్ర చికిత్స ద్వారా తొలగించారు. దాదాపు 8 నెలలుగా బాధపడుతున్న మహిళ పొత్త కడుపులో నుండి 7 కిలోల బరువైన కణితిని శస్త్ర చికిత్స ద్వారా తొలగించారు. మహిళ ప్రాణాపాయం నుండి సురక్షితంగా బయటపడ్డారు. ఈ శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేసిన జనరల్ సర్జరీ యూనిట్ 4 వైద్యుల బృందాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి నాగేందర్ అభినందించారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనరల్ సర్జరీ విభాగం యూనిట్ 4 ప్రొఫెసర్ డాక్టర్ రాజు, అనస్తీషియా విభాగం వైద్యులతో కలిసి వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని ఉద్గీర్ ప్రాంతానికి చెందిన వందన (38) గతంలో పదేళ్ల క్రితం కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించుకున్నారు. గత 8 నెలలుగా పొత్తి కడుపు పెరుగుదలతోపాటు కణితి ఏర్పడింది. ఆయాసం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స నిమిత్తం మే 4న ఉస్మానియా ఆస్పత్రికి వచ్చారు. జనరల్ సర్జరీ విభాగం యూనిట్ 4 ప్రొఫెసర్ డాక్టర్ రాజు ఆధ్వర్యంలో వైద్యుల బృందం ఆమెకు ఎమ్మెరై, సీటీ స్కాన్, ఇతర రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పొత్తి కడుపులో కణితి ఉన్నట్లు గుర్తించారు. మే 27న అనస్థీషియా వైద్యుల సహకారంతో శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. ఈ శస్త్ర చికిత్స కార్పొరేట్ ఆస్పత్రుల్లో సుమారు రూ.6 లక్షలు ఖర్చు అవుతుందని, ఉస్మానియాలో ఆరోగ్యశ్రీ లేకపోయినా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా పూర్తి ఉచితంగా కణితిని తొలగించినట్లు డాక్టర్ నాగేందర్ తెలిపారు. వందన కుటుంబీకులు ఉస్మానియా వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

అబిడ్స్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ధూల్‌పేట్ వీర్ సంఘటన్ అసోసియేషన్ అధ్యక్షులు, సీనియర్ బీజేపీ నాయకులు సర్దార్ సింగ్‌తో పాటు ఆయన అనుచరులంతా నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ...తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఆదరణ ఎలా ఉందో దేశవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు ఆదరణ లభిస్తుందన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రస్తుతం ముందుందన్నారు. పూజవ్యాస్ బిలాల్, ఆర్‌వి.మహేందర్ కుమార్, శంకర్‌సింగ్ జమేదార్, గోపాల్ సింగ్ పాల్గొన్నారు.

పొగాకు వాడకంతో ప్రాణాంతక వ్యాధులు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్, విద్యార్థులు

అఫ్జల్‌గంజ్ : మానవ జీవితం ఎంతో విలువైందని దుర్వ్యసనాల బారి నుండి ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని ఉస్మానియా దంత వైద్యశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి అరుణ, ప్రొఫెసర్ జగదీశ్వర్ సుఖభోగిలు అన్నారు. ఈ మేరకు బుధవారం అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, పీజీలు పొగాకుకు వ్యతిరేకంగా వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా పొగాకు తాగడం, గుట్కాలు నమలడం వల్ల నోటి క్యాన్సర్ వంటి ప్రాణాంతకర వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్ ఎస్ యాదవ్, ఐడిఎ జనరల్ సెక్రటరీ ఏ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నప్పటి నుంచే కళల పట్ల ఆసక్తి ఉండాలి



విజయనగర్‌కాలనీ: బాల్యదశ నుంచే కళల పట్ల ఆసక్తి ఉంటే భవిష్యత్తులో తమకు ఇష్టమైన కళల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత దరియానిరావు అన్నారు. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో లలిత కళాశాల ఆధ్వర్యంలో చిన్నారుల కోసం నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలను బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ..... కళలు మానసిక ఆనందాని పెంచడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునేందుకు దోహద పడతాయన్నారు. బాలికల్లో లలితకళలపై ఆసక్తి పెంచేందుకు పెయింటింగ్, ఫొటోగ్రఫీ, డ్రాయింగ్, యానిమేషన్, క్యాలిగ్రఫి (దస్తూరి), శిల్పకళ తదితర కోర్సులలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పిల్లల కళా ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.గంగాధర్, బలగం సినిమా నటుడు జయరామ్, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ జె.వెంకటేశ్వర్లతో పాటు సినీ కళాకారులు తిరుమల్, సంజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.